# 50 వేల జీడీఎస్ పోస్టుల భర్తీకి చర్యలు

- ఆన్‌లైన్ ద్వారా రిక్రూట్‌మెంట్ ప్రక్రియ
- భారత తపాలా శాఖ డైరెక్టర్ జనరల్ సుధాకర్ వెల్లడి



సాక్షి ప్రతినిధి, తిరుపతి: దేశవ్యాప్తంగా ఒకేసారి 50 వేల గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) పోస్టులను భర్తీ చేసేందుకు తపాలా శాఖ ఏర్పాట్లు చేస్తోందని భారత తపాలాశాఖ డైరెక్టర్ జనరల్ బోయపాటి వెంకట సుధాకర్‌రావు వెల్లడించారు. ఈ పోస్టులన్నింటినీ ఆన్‌లైన్ పద్ధతిలో భర్తీ చేసేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, మూల్యాంకన, అభ్యర్థి ఎంపిక వంటి కీలక ప్రక్రియలన్నింటినీ ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేసేందుకు సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇటీవలే నూతన డీజీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శనివారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలో 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం గ్రామీణ డాక్ సేవక్స్‌గా పరిగణించే బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, జీడీఎస్‌డీఏ, జీడీ ప్యాకర్ పోస్టులను డివిజన్ స్థాయిలోనే భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఇది వరకు పేపర్ ప్రకటన ద్వారా దరఖాస్తులు ఆహ్వానించి, మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని, ఇకపై మొత్తం రిక్రూట్‌మెంట్ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల పోస్టుల భర్తీలో పారదర్శకత ఉంటుందన్నారు. వచ్చే నెల రోజుల్లో సాఫ్ట్‌వేర్ సిద్ధమైతే సర్కిళ్ల వారీగా ఖాళీలను ఆన్‌లైన్‌లో పెడతామన్నారు. ఏపీకి విజయవాడ, తెలంగాణకు హైదరాబాద్‌లను పోస్టల్ సర్కిళ్లుగా ఏర్పాటు చేశామన్నారు.